క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ..



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన తాళ్లపల్లి సత్తమ్మ (దివ్యాంగురాలు) కుటుంబాన్ని శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. వేములవాడ మండలం శాత్రాజుపల్లి గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం సత్తమ్మ పనిచేస్తున్నారు. వెంట ఎంపీపీ జవ్వాజీ హరీశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోల రమేశ్, కాడె శంకర్, బండపెల్లి యాదగిరి, ఎల్లమ్మల కృష్ణ, సుధీర్, శ్రీనివాస్, బాబు పలువురు ఉన్నారు.

బియ్యం అందజేత

హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన మొగ్దుంపురం అనిల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సామాజికవేత్త, హెచ్‌సీఎల్ డైరెక్టర్ నబ్బని వెంకట్ శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం క్వింటాల్ బియ్యం అందజేశారు.

ధ్యానంతో ప్రశాంత జీవనం

సైదాపూర్: ధ్యానంతో ప్రశాంత, ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని సైదాపూర్ ఎస్‌ఐ జన్ను ఆరోగ్యం అన్నారు. శుక్రవారం వెన్కెపల్లి ఉన్నత పాఠశాల మైదానంలో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ధ్యాన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. శిక్షకులు ధ్యానం ఉపయోగాలు వివరించారు. ఉరుకులు, పరుగుల జీవితంలో రోజుకు గంట ధ్యానం చేయడంతో పరిపూర్ణ మానసిక, శారీక ఆరోగ్యం పొందువచ్చని తెలిపారు. కార్యక్రమంలో కొండ సత్యం, నాగుల భిక్షపతి, కూతురు విద్వాన్‌రెడ్డి, తుమ్మ అశోక్, దాసరి కనుకయ్య పాల్గొన్నారు.

గోరక్షక మహాధర్నాకు తరలిన నాయకులు

హుజూరాబాద్‌రూరల్: గోవుల రక్షణ కోసం ప్రభుత్వం వెంటనే గోరక్షక చట్టం తీసుకురావాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలో వీహెచ్‌పీ నాయకులు గోరక్ష మహాధర్నా తలపెట్టారు. మండలంలోని కనుకులగిద్దె గ్రామానికి చెందిన వీహెచ్‌పీ మండలాధ్యక్షుడు కంకణాల రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వీహెచ్‌పీ నాయకులు ధర్నాకు తరలివెళ్లారు.

గోదావరిఖని - కట్కూర్ బస్సు సర్వీసు పునరుద్ధరణ

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ గ్రామంలో గోదావరిఖని - కట్కూర్ ఆర్టీసీ బస్సు సర్వీసును కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. గతంలో కొనసాగిన సర్వీసును ఇటీవల నిలిపివేశారు. గత ప్రభుత్వ హయాంలో పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సర్వీసును పునరుద్ధరించలేదు. ఆకునూర్ గ్రామస్తులు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి గోదావరిఖని-కట్కూర్ సర్వీసును హుజూరాబాద్ టూ వయా సర్వాయిపేట హుస్నాబాద్ వరకు కొనసాగించాలని ఆదేశించారు. ఈమేరకు సర్వాయిపేట బస్సు రెండు రోజుల క్రితం ప్రారంభించారు. ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు సౌకర్యాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మద్దూరి రవీందర్‌రెడ్డి, మిట్టపెల్లి కిష్టయ్య, గురాల లింగారెడ్డి, రాయిశెట్టి చంద్రయ్య, ఎర్రల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఐదుగురిపై కేసు

జమ్మికుంట: దాడికి పాల్పడిన ఐదుగురిపై శుక్రవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి తెలిపారు. మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన పింగిళి సదయ్య, లక్ష్మి, శ్రీకాంత్, గొడుగు శ్రీకాంత్, రాధ మే 31వ తేదీన ఇంటి స్థలం విషయంలో పింగిళి సంపత్ కుటుంబ సభ్యులతో గొడవపడి కర్రలతో దాడి చేశారు. బాధితుడు పింగిళి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

డీఐఈవోకు వినతి

కరీంనగర్: నగరంలో అనుమతి లేని జూనియర్ కళాశాలలను మూసివేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డీఐఈవో జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు కనీసం మరుగుదొడ్లు, మూత్రశాలలు తాగునీరు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ఇంటర్మీడియట్ కళాశాలలను పర్యవేక్షణ చేసి విద్యార్థుల సమస్యలు పట్టించుకోవాలని కోరా రు. జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారాప్ రోహిత్, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, సద్విత్ కుమార్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను కమ్మేస్తున్నాయి..

- రహదారులకు ఇరువైపులా హరితహారం వృక్షాలు
- ఏపుగా పెరిగి దారులపైకి కొమ్మలు
- వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులు
- మలుపుల వద్ద వాహనాలు కనిపించక ప్రమాదాలు



ఖాసీంపేట- గన్నేరువరం గ్రామాల మధ్య రోడ్డును కమ్మేస్తున్న చెట్ల కొమ్మలు

గన్నేరువరం: హరితహారంలో కొన్నేళ్లుగా మండలంలోని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారుల పక్కన మొక్కలు నాటుతున్నారు. ఈ క్రమంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి రహదారులను కమ్మేస్తున్నాయి. దీంతో ప్రయాణానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెట్ల కొమ్మల కారణంగా మూలమలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు అగుపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. స్కూల్, కాలేజీలకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి బోల్తా పడిన సంఘటనలున్నాయి. అంతే కాకుండా ఎదురెదురుగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు రహదారులపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

➔గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట పొత్తూరు వరకు 21 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి వెంట చెట్ల కొమ్మలు రహదారిని కమ్మేయగా ఏడాది క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా గన్నేరువరం వరకు రహదారికి ఇరువైపులా ఉన్నచెట్ల తొలగించారు.

➔గుండ్లపల్లి నుంచి గన్నేరువరం వరకు చెట్ల కొమ్మలతో ఇబ్బంది తొలగింది. కానీ మిగతా రహదారిని, ఇతర గ్రామాలకు వెళ్లే రోడ్లను చెట్ల కొమ్మలు కమ్మేస్తుంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

➔జంగపల్లి నుంచి మాదాపూర్ వరకు రెండు కిలోమీటర్లు, ఖాసీంపేట నుంచి గన్నేరువరం వరకు మూడు కిలోమీటర్లు, ఖాసీంపేట ఎక్స్ రోడ్డు నుంచి హన్మాజిపల్లె ఎక్స్ రోడ్డు వరకు ఎనిమిది కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రహదారుల వెంట చెట్లు ఏపుగా పెరిగి కొమ్మలు రోడ్డుపైకి వస్తున్నాయి. మాదాపూర్ నుంచి ఖాసీంపేట వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రహదారి సైతం చెట్ల కొమ్మలతో ఇబ్బందిగా మారింది.

➔ఇకా ఖాసీంపేట నుంచి పారువెల్ల, జంగపల్లి నుంచి పీచుపల్లి, చొక్కారావుపల్లె నుంచి పొత్తూరు, మైలారం నుంచి గన్నేరువరం వరకు ఇదే పరిస్థితి ఉండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు.

➔వర్షాకాలంలో చెట్లు తొందర పెరుగుతూ పచ్చదనం సంతరించుకుంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల కళాశాలల విద్యార్థులు స్కూల్, కాలేజీలకు వెళ్లి వస్తుంటారు. పెద్ద ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు రహదారులపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు



హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. పెరిగిన చెట్ల కొమ్మలు రహదారులను కమ్మేస్తున్నాయి. వీటివల్ల మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి చెట్లకొమ్మలను తొలగించాలి.

-సీ. శ్రీశైలం, చొక్కాలపల్లె

చెట్ల కొమ్మలను తొలగిస్తాం

హరితహారం మొక్కలు ఏపుగా పెరిగి కొమ్మలు రహదారులపైకి వస్తున్నాయి. చెట్ల కొమ్మల వల్ల ప్రమాదాలు జరగకుండా ఆయా జీపీల అధికారులు, మాజీ పాలకవర్గ సభ్యులతో చేపట్టాల్సిన అంశాలపై చర్చిస్తున్నాం. ప్రస్తుతం రహదారులపైకి వచ్చిన కొమ్మలను తొలగించే చర్యలు చేపడుతాం.

– స్నేహజ్యోతి, ఏఈ పంచాయతీరాజ్‌శాఖ

క్వింటాల్ పత్తి రూ.7,300



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7,300 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 10 వాహనాల్లో 125 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,200, కనిష్ట ధర రూ.6,800కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్ యార్డుకు శని, ఆదివారాలు సాధారణ సెలవులు ఉంటాయని, సోమవారం యథావిధిగా క్రయవిక్రయాలు సాగుతాయని కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 14 మంది పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి, శుక్రవారం హుజూరాబాద్ కోర్టులో హాజరుపరిచారు. రాజు అనే వ్యక్తికి ఒకరోజు జైలుశిక్ష, రూ.100 జరిమానా, మిగతా 13 మందికి రూ.9,500 జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి పద్మసాయిశ్రీ తీర్పునిచ్చినట్లు టౌన్ సీఐ రమేశ్ తెలిపారు.

ఉపాధ్యాయుల బడిబాట ర్యాలీ



మానకొండూర్: వెల్ది గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



జమ్మికుంట: పిల్లలను అడ్మిషన్ చేసుకుంటున్న ఉపాధ్యాయులు



శంకరపట్నం: ఏరడపల్లి గ్రామ చెరువు వద్ద ఉపాధి కూలీలకు బడిబాటపై ఉపాధ్యాయుల అవగాహన

మానకొండూర్: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని, ప్రభుత్వం విద్యార్థులకు అందించే దుస్తులు, బుక్స్, మధ్యాహ్న భోజనం, ఇతర వసతుల గూర్చి పిల్లల తల్లిదండ్రులకు తెలియజేశారు.

జమ్మికుంట: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని హెచ్‌ఎం వేణుమాధవ్ అన్నారు. మండలంలోని మాచనపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాటలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నలుగురు చిన్నారులను పాఠశాలలో అడ్మిషన్ చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏబూషి శ్రీనివాస్, కర్ణకర్‌రెడ్డి, నాగరాజు, విజేందర్‌రావు, రాణి, రాములు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పర్లపల్లి సునీత తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని ఏరడపల్లి గ్రామ చెరువు వద్ద ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా టీచర్లు బడిబాట నిర్వహిస్తున్నారు.

మిషన్ భగీరథపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎంపీపీ చిలుక రవీందర్

చొప్పదండి: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మిషన్ భగీరథ, బడిబాటపై ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇంటింటికి తాగునీటి పథకం మిషన్ భగీరథలో కొత్త కనెక్షన్‌ల అవసరం సర్వే చేయాలని సూచించారు. ఈ నెల 10 నుంచి పది రోజుల్లో సర్వే పూర్తి చేసి నివేదిక అందించాలని అధికారులను కోరారు. బడీడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రావు, ఎంపీవో రాజగోపాల్ రెడ్డి, వేణు ప్రసాద్, రమాదేవి, రాజు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతు చేయాలి



ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న అజయ్

చొప్పదండి: మండల కేంద్రం నుంచి కరీంనగర్ వెళ్లే రహదారి ధ్వంసమైం ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్ విమర్శించారు. శుక్రవారం ధ్వంసమైన రోడ్డును పరిశీలించారు. కరీంనగర్ నుంచి లక్సెట్టిపేట, మంచిర్యాల, ఆదిలాబాద్, ధర్మపురి వైపు వెళ్లే ప్రయాణికులు గుంతల రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే పలువురు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారని అయినా రోడ్లు భవనాలశాఖ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. గతంలో నాసిరకంగా రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, ప్రజాధనం రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవీందర్, నాయకులు

చిగురుమామిడి: బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం కేంద్రంలో కొలువుదీరే ఎన్‌డీఏ ప్రభుత్వం వెంటనే కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సంకీర్ణ ప్రభుత్వంలో ఉన్న జనతాదళ్ నాయకులు కుల గణన చేపట్టాలనే ప్రతిపాదనను కొత్త ప్రభుత్వ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రామ మందిరం నిర్మించామనే భావనతో దేశంలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకుని తిరిగి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామనే ధీమాలో బీజేపీ నేతలున్నప్పటికీ అయోధ్య రామాలయం ఉన్న ఫైజాబాద్‌లో బీజేపీ ఓడిపోయిందన్నారు. మత విద్వేషాలతో పబ్బం గడుపుకుందామనే బీజేపీకి కేంద్రంలో అధికారం చేపట్టేందుకు కావాల్సిన సీట్లు రాలేదన్నారు. గత రెండు ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన మెజార్టీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో తగ్గిందని, విపక్ష కూటమి అనూహ్యరీతిలో పుంజుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీ, దళిత బహుజనుల సంక్షేమంపై ఇకనైనా దృష్టిసారించాలన్నారు. విలేకర్ల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండలశాఖ అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు తిరుపతి, నాయకులు ప్రశాంత్, శ్రీనివాస్, శివాంజనేయులు, లింగం, వెంకటయ్య, రాజమల్లు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కరీంనగర్‌కల్చరల్: పదో తరగతి, ఇంటర్‌లలో అత్యున్నత మార్కులు సాధించిన శ్రీవైష్ణవ విద్యార్థులకు జూలైలో ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు తెలంగాణ తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదుర్శలు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి శశికిరణ్ అచార్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ పేరు, తండ్రి పేరు, చిరునామా, సాధించిన మార్కులు మెమో జత చేసి జూన్ 30వ తేదీలోగా స్వయంగా కాని, పోస్టుద్వారా కాని అధ్యక్షుడు, శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ, శ్రీవైష్ణవ సదనం, రోడ్ నం.5, చంద్రపురి కాలనీ, ఎల్బీనగర్, హైదరాబాద్-500074 చిరునామాకు సమర్పించాలని కోరారు.

11న శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం 13వ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 11న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 7గంటలకు కలశ విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, నవకలశ స్థాపన, స్వామివారికి పంచామృత అభిషేకం, అలంకరణ, 11గంటలకు పంచసూక్త, మూలమంత్ర హవనం, పూర్ణాహుతి హారతి, తీర్థప్రసాదం, సాయంత్రం 6గంటలకు శ్రీరుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

పవర్‌కట్ ప్రాంతాలు

మానకొండూర్: విద్యుత్ మరమ్మతు పనుల దృష్ట్యా చెంజర్ల, గంగిపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నామని చెంజర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం. రమేశ్ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట, మాచనపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పట్టణ ఏఈ సురేశ్ ప్రకటనలో తెలిపారు. మోత్కులగూడెం, మారుతీనగర్, హౌజింగ్‌బోర్డు, దుర్గాకాలనీ, అంబేద్కర్ కాలనీ, పాత మార్కెట్ ఏరియా, మసీద్ ఏరియా, కృష్ణకాలనీ, ఎస్‌లెయి కాలనీ, కొత్త మార్కెట్, బస్టాండ్, గాంధీ చౌక్ ఏరియా, వీణవంక రోడ్డు, కొండూరి కాప్లెక్స్, శాలవాడ, సివిల్ ఆసుపత్రి ఏరియా, అబాది జమ్మికుంట, కేశవపూర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

ఇల్లందకుంట: మండలంలోని బూజునూరు, మల్యాల, కనగర్తి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని విద్యుత్‌శాఖ అదనపు సహాయ ఇంజనీర్ ప్రకటనలో తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మాటూరి వీరచారి ప్రకటనలో తెలిపారు. ఇప్పలనర్సింగాపూర్, దమ్మక్కపేట, కాట్రపల్లి, కేసీ క్యాంపు, ఇండస్ట్రీయల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కవితా పురస్కారం

కరీంనగర్ కల్చరల్: ప్రముఖ రచయిత్రి వాసా ప్రభావతి స్మారకంగా వాసా ప్రభావతి ట్రస్టు నిర్వహించిన వచన కవితా పోటీల్లో 'మౌన యాగం' కవితకు హైదరాబాద్‌లో గురువారం రాత్రి కరీంనగర్‌కు చెందిన కవి దేవి యాదగిరికి కవితా పురస్కారం ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.3 వేల చెక్కును చారిత్రక నవలా రచయిత మదిగొండ శివప్రసాద్ చేతుల మీదుగా అందించారు. పురస్కారం దక్కడం పట్ల రచయితలు కందకూరి అంజయ్య, సబ్బని లక్ష్మీనారాయణ, సంకేపల్లి నాగేంద్ర శర్మ, సీవీ కుమార్, దేవి శ్రీహరి తదితరలు అభినందనలు తెలిపారు.

బీమా చెక్కులు అందజేత



శంకరపట్నం: నగదు అందిస్తున్న సభ్యులు



ఇల్లందకుంట: చెక్కు ఇస్తున్న మేనేజర్ మహేందర్

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామం పురుషుల పొదుపు సంఘం సభ్యుడు ఒడ్నాల వీరాస్వామి ఇటీవల మృతిచెందాడు. శుక్రవారం మృతుడి కుటుంబానికి రూ.70 వేల బీమా సొమ్మును సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో కుమార్, శ్రీనివాస్, సంపత్, ఎల్లయ్య, మొగిలయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలి

వీణవంక: వ్యవసాయ పంట రుణాలు తీసుకునే సమయంలో ప్రతి రైతు ప్రమాద బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరీంనగర్ డీజీఎం అపర్ణరెడ్డి అన్నారు. మండలంలోని చల్లూరు బ్రాంచ్ పరిధిలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మాదిగంటి రాజిరెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందగా శుక్రవారం రూ. ఐదు లక్షల బీమా చెక్కు అందజేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన గన్ను శ్యాంసుందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జమ్మికుంట లోని దీ గాయత్రి కో ఆపరేటీవ్ అర్బన్ బ్యాంకులో మృతుడి సేవింగ్ ఖాతాపై ప్రమాదబీమా ఉంది. శుక్రవారం రూ.లక్ష చెక్కును మృతుని భార్య అరుణకు మండల వ్యవసాయ అధికారి రజిత సమక్షంలో బ్యాంకు మేనేజర్ ఒడ్డుల మహేందర్ అందజేశారు.

జూలై 7న మాదిగల ఆత్మగౌరవ కవాతు

కరీంనగర్: ఎమ్మార్పీఎస్ మూపై్ప ఏళ్ల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జూలై 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ అన్నారు. శుక్రవారం నగరంలోని కృషిభవన్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. మాదిగల 30 ఏళ్ల కల ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన అని, మూడు దశాబ్దాల ఆకాంక్షకు పరిష్కారం రాబోతుందని, ఈ కీలక దశలో జాతిని పోరాటంలో భాగం చేయాలని అన్నారు. జిల్లాలోని మాదిగ, ఉప కులాల నిరుద్యోగ యువత, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు అన్ని విభాగాలను నూతన కమిటీలను నిర్మాణం చేసుకొని వరంగల్‌కు రావాలని కోరారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు వెంకటస్వామి, రామచందర్, అంజయ్య, రమేశ్, శ్రీనివాస్, మల్లయ్య, అరుణ్, మహేశ్, మధునయ్య, కొమ్మల రాజమల్లు, నక్క లక్ష్మణ్, మొదంపల్లి ప్రభుదాస్, శ్రీనివాస్, కుమారస్వామి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.